# సంజయ్‌నీతి

''పో రానిసోట్లకు పోవాల్నేగానీ రారానిమాట్లు రానేవస్తాయి. పొయ్యేదెందుకు? ఆమిందట ఆమాట్లు పళ్ళేకుండా ఓయబ్బా! అంటా వాగేసేదెందుకు? ఉణ్ణికాడికి అంత నిమ్మతిగా తినేసి కొంపలో రామాక్రిష్ణా అంటా కూసోమంటే యినిపించుకోడే ఈ మొగోడు? ఇచ్చు యిలంబరం. బొచ్చు మంగాపురమని యీదల్లో పొయ్యే జగడం యింటికాడికి రాకుండాబోతే ఈ కారివేదికి కంటిమింద రెప్పట్టా పడ్తే?''

అట్టా కుండను గోకినట్టుగోకే మాబాశాలి నేను పడకమిందుండంగానే-

''అయ్యోపాపం! ఆయనేమన్నా తొవ్వి తలకెత్తమన్నాడా? పోనీ అబ్బుల గంటేమన్నా మూటలుగట్టి ఈపలమింది కెత్తమన్నాడా? వారం దినాలుగా యింటిసుట్టూ పెళ్లు సుట్టు సిన్నబిడ్డ కొంగు బట్టుకోని తిరిగినట్టు తిరగతా ఉండాడు. అట్టపొయ్ ఒక మాట సెప్పేసొస్తే అబ్బుల గంటేమన్నా దిబ్బలపాలై పూడిస్తిందా? లేకుండాబోతే నోటి ముత్తాలేమన్నా రాలి పోబోతాయా?''

'ఆహాఁ హాఁ! వాగిసినట్టే వాడాలి తాడుతెంచేదంటే యిట్నేనేమో? అయినా యిట్టాఅట్టా కూడా రొండుపక్కలా వాయించాలంటే ఈ ఆడోళ్లకే తగునబ్బా!' అని అన్లేదు గానీ ఆలోచించుకుంటా లేచినా. ఒకేళ నోరుజారి అనుంటేనా పొయ్యిలో ఉప్పుపోసి శాటడ్డం పెట్నెట్టేగదా?

''తెల్లారీ తెల్లారకాడికే యింటికాడికొచ్చి ఆయిన గడప ముందర కావిలి కాస్తా

ఉండేది సూస్తా ఉంటే అచ్చం అప్పులోడు నిలబడుకుణ్ణెట్టుండాది. ఇరుగు పొరుగుచూస్తే ఏమనుకుంటారో? ఏమో? అని సీమకుట్నెట్టు గూడా లేకుండాబోతే ఎట్టమ్మా ఈ మొగోడికి? అయితే అయితిందని కాకుంటే కాదని సెప్పాల. ఇట్టా తిప్పించుకుంటే పెద గొప్పతన మేమో?''

కుండగోకుడు కాకుండా స్టీలుపాత్రల్లను నైస్‌గా తోమినట్టుగా తోమతా ఉంటే ఆ పూటకా తోముడు సాలు సాలనుకుణ్ణా. ఆదరాబాదరా రోన్ని మంచినీళ్ల ముంతతో తోడుకోని గబగబ నెత్తిన కుమ్మరించుకుణ్ణా. ఆపె అందించిన కాఫీనీళ్ల గొంతులో పోసుకుణ్ణా. ఇంటి ముందర అప్పులోడి బాద వగదెంచు కోవాలనుకుని అడుగు బయటపెట్నా.

ఇంటి ముందర పడిగాపులు గాసే ఆ మణిసి నన్ను చూసె. దీనాతిదీనంగా మొకం పెట్టె. రొండు చేతులు పైకెత్తె. దేముడే ఎదురంగా సాచ్చాత్కారం అయితేగూడా అట్టా చేతులు పైకెత్తడేమో? అయినా ఆమణిసిని చూస్తావుంటే గొంతు కొరికి నెత్తురు తాగదామన్నెంత కోపం గొంతుదాకా వచ్చె. దాన్ని అట్నే అదింపటేసి నవ్వుమొకం పెటేసినా.

ఆ మణిసి గుమ్మయ్‌పాయ!

ఇద్దరూ యీదిమింద పడ్తిమి. నేనేమో ముందు. అతగాడు నా ఎనకాల. నాలుగ్గాళ్లమండపం చేరుకోకముందే అతగాడు పక్కన చేరుకుండె. చెవల్లో నిజిం చెప్పొద్దూ? యిల్లే కట్టుకుండె! అది పాత పాటే!

ఆ పాట్నే మొగలాయి యిప్పుడు శివరంజిన్లో పలికిస్తా ఉండాడు.

''పువ్వల్లో బుట్టి పువ్వల్లో పెరిగి నోళ్లయితే పుల్లించి పారేసినట్టు మాట్లాడేస్తారు. తమరట్టా గాకపాయ. కష్టప్పుడీ... సెమప్పుడీ పైకొచ్చినోళ్లు గదా? వద్దన్నా ఒక వక్కపాలుకంత కనికారం మాబోటోళ్లమింద ఉండనే ఉంటింది. తవరికి తెలవదనిగాదు. కన్నగసాట్లు పడీ పిలగోణ్ణి సదివించినా. ఆ సదువుకే వోడికీ నాకుకూడా సావుజంపులై పాయ. ఆ సదువుతో వాడికొక అటెండ్రు ఉద్దోగం కూడా రాదని. అపుడేం చెయ్యాల. కన్నకూళ్ళా కుడ్సి తమబోటోళ్ల కాళ్లోసేతులో పట్టి డొనేసన్ కట్టి. వోణ్ణి ఆ ట్రయినింగ్ సదివించే కుందికి దీపెంలో సమురు అడుగంటి పూడ్సింది. ఇప్పుడు తమరా వత్తినట్టా ఎగదొయ్య కుండాపోతే దీపెం ఎప్పుడు మలిగి పోతిందో? ఏమో? ఆ దేముడికే ఎరిక. సచ్చి మీ కడపున పుట్తా. నన్నెత్తి అట్టా గెడ్డన పారెయ్యండి.''

అతగాడిని ఎత్తి అట్టా గెడ్డన పారేసేదంటే టీచర్ ట్రెయినింగ్ చదివేసిన అతగాడి కొడుక్కు మున్సిపాల్టీలో టీచరుద్దోగం ఎయ్‌పించాల. అప్పుడా యింట్లో మలిగి పోబొయ్యే దీపెం ఒక్కసారిగా ఎలిగి పోతింది. ఆయనట్టా గెడ్డనపడిపోతాడు. అయితే ఆపని నాచేతుల్లో లేదని నాకు తెల్సు. అంతకన్నా బాగా ఆయనక్కూడా తెల్సు. అయినా ఎవురో ఒక కవున్సిలర్తో నేనొక మాట చెప్తే పనై పూడిస్తుందని ఆయన మణుసులో శానా గెట్టిగా

నాటుకోని పొయ్యుండాది. అందుకే ఆ మణిసి నన్ను గెట్టిగా పట్టుకునేసినాడు. ఇంకనేను పొయ్ ఎవుడో ఒక కవున్సిలర్ చేతులుగాదంటానే చేతులే పట్టుకోవాల!

అతగాడి రాగం ముగతాయింపు కొస్తాఉండాది. మేము కవున్సిలర్ వెంకట్రాముడి యింటి ముందిరి కొచ్చినాం. అతగాణ్ణి బయిట్నే నిలబెట్టి నేనొకడే లోపలికి బోతే ఏమనుకుంటాడు? 'ఇదేందిది? లోపలా బయటా యవ్వారంగా ఉండాదే?' అని-అనుకుంటాడేమో అనుకోని ఎనకాల్నే రమ్మంటే 'ఎందుకొద్దులే?' అంటానే గంగిరెద్దు మాదిర తలకాయాడిస్తా ఎంటపడె.

ఈ దినాల్లో తెల్లారేకాడికి ఏమి వచ్చినా ఏమి రాకుండాపొయ్‌నా పేపరు మాత్రం పోటాపోటీల మిందొచ్చి వాకిట్లో పడ్తింది. తవుడుబుట్లో మూతి దూర్చేసిన ఎద్దు మాదిర పేపర్లో తల దూర్చేసిన వెంకట్రాముడు అలికిడయ్యే కుందికి తలపైకెత్తి చూసె. ఎగిరి పడిలేసె. ఎదురుంగా వచ్చి ఎదకేసి అదుంకుండె!

ఆడికే పనై పొయ్‌నట్టుగా నా ఎంటొచ్చిన మణిసి ఏకంగా కల్లాణిరాగం అందుకుండే కోపు మింద ఉండాడు.

చెప్పిందంతా స్రెద్దగాయినేసి నా సావాసకాపు వెంకట్రాముడు-

''ఒరే నా.కొడకా! దొంగలుపణ్ణె ఆ ర్నెల్లకు కుక్కలు మొరిగినట్టుండాది గదరా నీయవ్వారం. టీచరుద్దోగాలకు ఎప్పుడో యింటర్వ్యూలైపొయ. అపాయింటుమెంటు ఆర్డర్లుకూడా యిచ్చేసిరి. అప్పాయింటయినోళ్లు ఉద్దోగాల్లో జాయినుగూడా అయ్‌పొయ్‌నారే! ఇప్పుడొచ్చి చేతులుగాదు కాళ్లు కాళ్లుగాదు చేతులు. అంటే అవ్వియివ్వవబోతాయా? ఇవ్వి అవ్వి అవబోతాయా?''

''నువ్వన్నెట్టు అంతపని జరిగి పొయ్యుంటే ఊళ్లో ఒక జాతర...''

''జరిగినంత పనై పొయ్యుండాల్సిందేరా! మా వాళ్లు మేలుకున్నారు. నాలుగు కుక్కల ముందర కూరాకూడు వడ్డించిన యిస్త్రాకేస్తే ఏమయితిందో యింతకాలానికి తెల్సుకున్నారు. ఎట్టా పరిస్తితుల్లోగూడా అట్టామాదిర కాగూడదనుకున్నారు. మూసిపెట్నె గంపలు మూసిపెట్నెట్టేఉండాయి. కోళ్లుమాత్రం అవుపించలా!''

''కత శానా శానా దూరం పొయ్యుండాద్దే? అదెట్టా జరిగిందబ్బా?''

''అదే నువ్వడగ రాదు. నేను నుడవరాదురా. అయినా ఊరంతా కోళ్లయి కూస్తావుంటే నన్నెందుకు ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి యీడస్తావే? ఎంత చెడిపొయ్‌నా సొజాతి మింద ఒక నూగ్గింజంతన్నా అబిమానం ఉండాల్నా పన్లేదా? పోనీ నువ్వే చెప్పరా!'' అని అడిగే కుందికి 'ఆమాటగూడా నిజిమే గదా? అయ్యోపాపం కుక్కాశ గుండ్రాత్తో తీరిపొయ్ నట్టాయినే బతుకు!' అని అనుకుంటా ఎలబార్నా.

ఆడికొచ్చేటప్పుడు నేను ముందు. ఆ మణిసి నా ఎనకాల. అణ్ణుంచి ఎలబారే కుందికి ఆ మణిసి ముందు. నేను ఎనకాల. గడపట్టా దాట్నావో లేదో? వాడిపాసుగాల! తిరిగి మల్లి

చూడకుండా వస్తా పోతానని ఒకమాటమాత్రం చెప్పకుండా సివ్వమాదిర్తో దూసుకోని పోతా ఉండాడే మొనగోడు. ఇట్టాంటోళ్లనే ఏరుదాత్తే తెప్పగాల్సే నాయాండ్లు! అంటారేమో? అనుకుంటా వుంటే మణుసు అదొకమాదిరైపాయ!

అవును మరి? పనుంటే ఈన్నెగొడ్డు మాదిర యింటిచుట్టూ వొగిటికి పదిసార్లన్నా తిరగతారు. కాదుగీదంటే కాళ్లుపట్తారు. కావాలంటే కార్లే యింటిముందర నిలబెట్తారు. మరికొందురు బతకనేర్సిన కొడుకులైతే అయిద్రాబాద్‌కు పోతే పుల్లారెడ్డి స్వీట్లు అదే తిరపతిలో అయితే బీమాసోళ్ల స్వీట్లు అదేపనిగా తెచ్చి ఆడపెట్టేసి పోతారు. ఇంక మందు మరిగించి సందు చూసుకోని యవ్వారాన్ని చక్క చేసుకునే వాళ్ల సరేసరి! ఇట్టాటోళ్లంతా అచ్చొస్తే అక్కగారికి లేకుండాబోతే గురప్పడికి పెట్టేరకాలు. అని ఆలోచించుకుంటా ఎప్పుడొచ్చినానో నాలుగ్గాళ్లమండపం కాడి కొచ్చేసినాను.

''ఎట్టెట్టా? పార్టీవోళ్లు... ఆపోజిట్టు పార్టీవోళ్లు... ఈ పార్టీవోళ్లు... యింకొక పార్టీవోళ్లు కమిటీలో ఏడుమందుంటే ఆ ఏడుమందీ వొగిటైపూడ్సినారా? ఉద్దోగాల్ను యాలంపాట పెట్నారా? అట్టాపెట్టి పెట్తేవొచ్చిన దుడ్డంతా కూడేసి అందురూ సమంగా పంచుకుణ్ణారా? అయితే యిప్పుడేమయింది? అన్నాయమై పూడ్సిందంటావ్. సరేనబ్బా! యిది అన్నాయమైపోతే ఆ పొద్దు నువ్వు దుడ్లు తీసుకోని ఓటేస్తివే? అది...''

''థూః! అంత గిరంసెణ్ణె నాకొడుకనుకుణ్ణావా నన్ను?''

''ఒరె వొరె! నువ్వంటే నువ్వా? నువ్వు గాకపోతే యింకొకడు. ఒకడేమో దుడ్లుగా తీసుకుండె. ఒకడు తినే దానికనె. ఇంకొకడు తాగేదానికనె. ఎట్టయితే ఏంవుండాది? ఆ పొద్దు సిల్లర మల్లరగా తీసుకుంట్రి. ఈ పొద్దు అదెంతా జమచేసి బిల్‌ముక్తాగా యిస్తిరి. ఇందమ్మా తీగూరంటే యిందమ్మా పులగూర. అంతేగదంట్రా?''

''స్టీలుప్లేటల్లో కొండలడ్డు... కొసురుకొక రైగ్గడ్డపెట్టి గంగమ్మ జాతర్లో సున్నుపుకుండలు యింటింటి కొచ్చినట్టు ఒక యిల్లు యిడ్సిపెట్టకుండా తెచ్చిస్తే లడ్డు మాదిర యిచ్చిందే సాలని తీసుకుంట్రే? అది...''

''ఒరే! యిచ్చింది తీసుకుణ్ణింది ఆడికిడ్సి పెట్టండ్రా. తీసుకుణ్ణింది కొంచింగావచ్చు. ఇచ్చుకుణ్ణింది యింకా జాస్తిగా ఉండచ్చు. అదిగాదే పాయింటిప్పుడు? ఊలోళ్లసొత్తు ఉక్కళంగా తినేసే దొంగనాయాండ్లు ఊరూనాడంతా ఉంటే పాపం! ఈళ్లట్టా కాదుగదా? బతుకుదెరువు సూపించిగదరా దుడ్లు తీసుకుండ్రి. బతికే యారవ సూపించినోళ్లకు ఆమాత్రంజేస్తే యాడా కొంపలంటక పోవులేరా?'' వెంకట్రాముడి గుండికాయి నాలుగ్గాళ్లమండపం కాడ పంబ పలికినట్టు పలకతా ఉండాది!

పార్టీ యిబేదాలు మర్సిపాయ్‌రి. ఏడుమంది ఏకతాటిమింద నిలబడ్రి. యాలంపాట పెట్రి. ఉద్దోగాలు అమ్ముకుండ్రి. వచ్చింది తిలాపాపం తలా పిడికిడుగా పంచుకుండ్రి. ఈళ్లందుర్నీ నాలుగ్గాళ్లమండపంకాడికి యీడ్సుకోనొచ్చి 'ఓట్లేసింది యిందుకేనా?' అంటా

నిల్దీసి మూతిమింద కొట్టాల్సిందిపాయ్ వాళ్లు నీతులు మాట్లాడేది యింటావుంటే 'అవరా? యిపరీతకాలమా?' అనిపించె. ఇంక ఈ బతుకులు కడతేర బొయ్యేది ఎట్నో? అనుకుంటా యిట్ల తిరిగేకుందికి ముత్తారెడ్డన్న.

ఎదురుంగా నిలబడుకోని ముసిముసిగా నవ్వతా ఉండాడు.

''ఒరే అబ్బోడా! యింటా ఉండాన్రా. ఈడ నిలబడుకోని అంతా యింటా ఉండాన్రా. సంజయుడే మన్నాడో తెల్సా? అసలు సంజయుడెవుడో తెలిస్తే గదా వాడేమన్నాడో తెల్సేదానికి? మీ మాదిర చెడీబడీ కతలు రాస్తా మడికాడ చేని కాడ మాట్లాడుకుండే యిల్లామల్లిమాట్లే రొండు గెలికేసి నాకు మించిన మొనగోడు లేడనే ఎరిముండల్ను అడిగితే సంజయుడు ఇందిరమ్మ కొడుకంటారు. బారతం బాగవతం ఒక్కసారైనా ఈకడ నుంచి ఆకడదాకా చదివి ఏడ్సుంటే యిప్పుడు ఈ ఏడుపే ఉండేది గాదు. సంజయుడంటే వాడే! గుడ్డోడి చేతి ఊతకట్టి. ఏమన్నాడో తెల్సా? ఒకనాటి దర్మం యింకొకనాటికి ఆదర్మం అవితింది. ఆ అదర్మమే యింకొకనాటికి దర్మం అవితింది. అని! అన్నాడా? అన్నాడు. ఇన్నావా? యిన్నావు. ఇంకేం? గప్‌చిప్‌ని నోరుమూసుకోని యింటిదోవ పట్టు!'' అనె.

ఏడుమంది కవున్సిలర్లు ఏకంగా యింత అన్నాయానికి పాలుమార్తే ఆ అన్నాయాన్నే నాయంగా తీర్పు చెప్పిన నాలుగ్గాళ్లమండపానికి నోరు కండ్లూ రొండూమూసుకొని రొండు చేతులెత్తి దణ్ణం పెడ్తి! ●